క్లుప్తంగా

వేగేశ్వరపురంలో పారిశుధ్య డ్రైవ్

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వర్షాకాలం ప్రవేశించినందున వ్యాధులు ప్రబలకుండా రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలను జేసీబీ సాయంతో ట్రాక్టర్లపై లోడ్ చేయించి బయటకు తరలిస్తున్నారు. గ్రామంలో రోడ్డు పక్కన చెత్త, ఇతర వ్యర్థాలు వేయడంతో వర్షా కాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ శ్రీ కొమ్మిరెడ్డి పరశురామారావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి డీఎస్సీ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీసులను క్రమబద్ధీకరించాలని వినతి

ఉండ్రాజవరం: తమ సర్వీసులను 114 జీవో ప్రకారం క్రమబద్ధం చేయాలని మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఇదే జీవో ప్రకారం గతంలో కొందరి మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల సర్వీసులను క్రమబద్ధం చేశారని, ఇప్పటికీ మరో 966 మంది మిగిలి ఉన్నారని ఆ వినతి పత్రంలో వారు పేర్కొన్నారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులను కలసినట్టు తెలిపారు. మంత్రిని కలసి వినతిపత్రం అందజేసిన వారిలో ఐఎస్‌టీయూసీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి కాపా నాగరాజు, కె. సీతయ్య, ఆర్.శ్రీనివాసరావు, ఎం.సుధాకర్, వి.చిరంజీవి, యు.రాము, బుర్లు శ్రీనివాసు, డి.సుబ్రహ్మణ్యం ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నల్లజర్ల: మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ మండలంలోని సింగరాజుపాలెం, అవపాడు గ్రామాలకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరాజుపాలెంలోని 33బై 11కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేసే నిమిత్తం సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. ఈ రెండు గ్రామాల్లోని వ్యవసాయ పంపుసెట్లకు మంగళవారం తెల్లవారుజాము 3 నుంచి ఉదయం 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

నేడు తాడిమళ్లలో..

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుబ్బాలమ్మ హుండీ ఆదాయం రూ.2 లక్షలు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలో కొలువైన గుబ్బాలమ్మ వారి ఆలయ హుండీని సోమవారం తెరిచి, లెక్కించినట్టు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాష్ తెలిపారు. దేవదాయ శాఖ తాడేపల్లిగూడెం ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో ఈ ఆలయ హుండీని లెక్కించగా 115 రోజులకు రూ.2,00,738 ఆదాయం వచ్చినట్టు ఆయన వివరించారు. ఉప సర్పంచ్ ఎ.శ్రీనివాస్, నాయకులు ఆరేపల్లి చిన నంగాలు, నీలం శ్రీనివాస్, పి.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు: మండలంలోని కుమారదేవం గ్రామానికి చెందిన మర్రి భవాని అనే మహిళ తన మూడేళ్ల కుమార్తెను తీసుకుని గత నెల 12న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా భార్య, కుమార్తెల ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త మర్రి వెంకన్నబాబు సోమవారం కొవ్వూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో తనతో గొడవ పడినపుడు తన భార్య సామర్లకోటలోని పుట్టింటికి వెళ్లిపోయిందని వెంకన్నబాబు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దల సమక్షంలో నచ్చజెప్పి కాపురానికి తీసుకుని వచ్చానని పేర్కొన్నారు. నెల రోజులు కాపురం సవ్యంగానే చేసిందన్నారు. తాను వ్యవసాయ పనుల నిమిత్తం బయటకి వెళ్లినపుడు కుమార్తెను తీసుకుని వెళ్లిపోయిందన్నారు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు రూరల్ ఎస్సై కె.సుధాకర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వెంకన్నబాబు పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేశారు.

జనసేనలో ఆర్థిక నేరగాళ్లకు చోటు లేదు

తాళ్లపూడి: ఆర్థిక నేరగాళ్లకు, ప్రజలను మోసగించే వారికి జనసేన పార్టీలో స్థానం లేదని అలాంటి వారి గురించి పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళతామని ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు స్పష్టం చేశారు. మండలంలోని వేగేశ్వరపురంలో సోమవారం రాత్రి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన మండల నాయకుడిపై టీవీ రామారావు కీలక వ్యాఖ్యలు చేశారు. సొంత పార్టీ నాయకులపై రామారావు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తిపై గతంలో పలు ఆరోపణలు వచ్చాయన్నారు. ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమికి నష్టం కలగకూడదనే ఉద్దేశంతోనే సంయమనం పాటించామని అన్నారు. పలువురిని మోసగించారనే అభియోగాలు చాలా ఆయనపై వచ్చాయన్నారు. పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదన్నారు.



వైఎస్సార్ జయంతి సందర్భంగా దేవరపల్లిలో కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత



కొవ్వూరు మెరక వీధిలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి



నిడదవోలు వైఎస్సార్ కాలనీలో వైఎస్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు

పేదల గుండె చప్పుడు వైఎస్

- మాజీ హోం మంత్రి తానేటి వనిత
- ఘనంగా దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి జయంతి
- డివిజన్ వ్యాప్తంగా పలువురు నివాళులు
- పలుచోట్ల కేక్ కటింగ్‌లు
- మహానేత సేవలను గుర్తు చేసుకున్న వైఎస్సార్ సీపీ నేతలు

దేవరపల్లి: పేదల గుండె చప్పుడు తెలుసుకుని పాలన అందించిన మహనేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా అట్టహాసంగా నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు రాజన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాలుగు మండలాల్లో నిర్వహించిన ఈ వేడుకల్లో మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత పాల్గొని మహానేతకు నివాళులు అర్పించారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి తానేటి వనిత, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు తదితరులు పూలమాలలు వేసిశ్రద్ధాంజలి ఘటించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ పేదల అవసరాల మేరకు ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ , ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. రాజన్న ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టిస్తే, జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తండ్రికి తగ్గ తనయుడిగా చక్కటి పాలన అందించారన్నారు. జగనన్న వెంట ధైర్యంగా నడుద్దామని, రాజన్న ఇచ్చిన ధైర్యంతో జగనన్నకు అందరం అండగా నిలుద్దామని వనిత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, గ్రామకమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, కదలి హైమావతి, అనిశెట్టి సూర్యచంద్రం, కవల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు వైఎస్సార్

కొవ్వూరు: సుస్థిర పాలనతో ప్రజల మదిలో చెరగని ముద్ర వేసి, రాష్ట్ర చరిత్రలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయుడయ్యారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ తలారి వెంకట్రావు అన్నారు. పట్టణంలోను, మండల వ్యాప్తంగా సోమవారం వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు మెరక వీధిలోని వాటర్ ట్యాంకు జంక్షన్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి వెంకట్రావు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. అనంతరం మెయిన్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడే కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, పార్టీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగల్లపాటి శ్రీనివాస్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీదేవి, పార్టీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర , ఉప్పులూరి సూరిబాబు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మండలం వ్యాప్తంగా..

ఐ.పంగిడిలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, సర్పంచ్ గోశాల నాగర్జున తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెనకనమెట్ట సావరంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు ఆధ్వర్యంలోను, కాపవరంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ ఆధ్వర్యంలోను, తోగుమ్మిలో ఉప్పులూరి సూరిబాబు ఆధ్వర్యంలోను, వేములూరులో సొసైటీ మాజీ అధ్యక్షుడు కొటికలపూడి అబ్రహం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎలికే చిన వీర్రాజు ఆధ్వర్యంలోను వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, పెద్దేవం, పోచవరం గ్రామాల్లో నిర్వహించిన మహా నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొని నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ పిట్టా శ్రీనివాస్, నాయకులు సిద్ధంశెట్టి కృష్ణ, యాళ్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వేగేశ్వరపురం, అన్నదేవరపేట, గజ్జరం, మలకపల్లి, తాడిపూడి, గజ్జరం , తిరుగుడుమెట్ట, ప్రక్కిలంక, బల్లిపాడు గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు శ్రద్ధాంజలి ఘటించారు. కేక్‌లు కట్ చేశారు. చాక్లెట్లు, మిఠాయిలు పంచారు. సర్పంచు కొమ్మిరెడ్డి పరశురామారావు, గండి రాంబాబు, నాయకులు కుంటముక్కల కేశవనారాయణ, పోశిన శ్రీకృష్ణదేవరాయులు పాల్గొన్నారు. కాగా అన్నదేవరపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కొలూరి రాజుకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆ పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పి. నాని రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు.

నిడదవోలు: పట్టణంలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడి సారథ్యంలో వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు స్థానిక వైఎస్సార్ నగర్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడి వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, గాజుల రంగారావు, ఎస్‌కే వజీరుద్దీన్, కామిశెట్టి సత్యనారాయణ, గుర్రం జేమ్స్, ఎండీ ఫయాజ్, ఎస్‌కే ఖాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల, కోరుమామిడి, కాటకోటేశ్వరం, పురుషోత్తపల్లి, పెండ్యాల, జీడిగుంట, అట్లపాడు గ్రామాల్లో వైఎస్సార్ జయంతిని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. అట్లపాడులో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, తాడిమళ్లలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిమ్మరాజుపాలెంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు యాళ్ల రామారావు కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు ముప్పిడి చంద్రశేఖర్, అంబటి గోపమ్మ, తిక్కా శ్రీను, ఎంపీటీసీ సభ్యులు పడాల రంగారావు, వీరప్రసాద్, పెనుగుర్తి రాము, కొప్పుల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కోసూరి అప్పారావు, గుంటుపల్లి రామచంద్రం, కృష్ణమూర్తి, కారింకి సూర్యచంద్రం, కోసూరి భాస్కరరావు, కారింకి సత్యనారాయణ, బోనిగే వెంకట్రావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఉండ్రాజవరంలో జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, వైస్ ఎంపీపీ ఎన్.సరోజిని, సర్పంచ్ మెండే వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణఫర్, బీఎస్సార్ యూత్ సభ్యులు వైఎస్‌కు నివాళి అర్పించారు. మోర్తలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆలపాటి నరేంద్ర ఆధ్వర్యంలో సర్పంచ్ చిటికెన సుజని, ఎంపీటీసీ సభ్యురాళ్లు జానీ నాగలక్ష్మి, వెలిగట్ల రాణి, ఉప సర్పంచ్ దాపర్తి రామసందీప్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చిటికెన సూరిబాబు ఆధ్వర్యంలోను, పాలంగి గ్రామంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వేలిచేటి జానకిరామయ్య, పాలాటి శరత్ బాబు, బొక్క శివకుమార్, తాడిపర్రులో ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు, ఆధ్వర్యంలో వైఎస్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. కె.సావరంలో నాగిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నల్లజర్ల: అనంతపల్లి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ హోం మంత్రి తానేటి వనిత పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, బంక అప్పారావు, ప్రత్తి మురళీకృష్ణ, బళ్ల నాని, జాజుల దుర్గారావు, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లి గ్రామంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.అలాగే మండలంలోని 18 గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు వైఎస్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలల వేసి నివాళి అర్పించారు.

చాగల్లు: మండలంలోని చాగల్లు, చంద్రవరం గ్రామాల్లో నిర్వహించిన వైఎస్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తలారి చేతుల మీదుగా వృద్ధులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పంచారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు తదితరులు పాల్గొన్నారు. చంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, పార్టీ రైతు విభాగం నాయకులు గుమ్మడి శైలేంద్ర, బండి అశోక్ పాల్గొన్నారు. అలాగే బ్రాహ్మణగూడెంలో పార్టీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలోను, ఊనగట్లలో సర్పంచ్ మట్టా వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు ఆత్కూరి గోపీచంద్ ఆధ్వర్యంలోను వైఎస్ జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగ చిక్కాల, చిక్కాలపాలెం, కలవలపల్లి గ్రామాల్లోనూ వైఎస్‌కు నివాళులు అర్పించారు.



తాళ్లపూడిలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు



నిడదవోలు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో ..



ఉండ్రాజవరంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బూరుగుపల్లి సుబ్బారావు



నల్లజర్ల మండలం అనంతపల్లిలో మాజీ హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో..



ఖండవల్లిలో వైఎస్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తదితరులు



బ్రాహ్మణగూడెంలో వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాడు–నేడు పనుల తీరుపై విచారణ చేయిస్తాం

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- వేములూరు యూపీ పాఠశాల సందర్శన

కొవ్వూరు: నాడు–నేడు పథకం కింద మండలంలోని వేములూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లో చేపట్టిన పనుల వివరాలను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆరా తీశారు. ఈ పాఠశాలను సోమవారం సందర్శించిన ముప్పిడి రూ.49 లక్షల వ్యయంతో చేపట్టిన పనులపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ పనుల తీరుపై సంబంధిత అధికారులతో చర్చిస్తామని, సమగ్ర విచారణ చేయిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ఏవైనా తేడాలుంటే చర్యలు తీసుకుంటామన్నారు. పై అంతస్తులో శ్లాబుకు బదులు రేకుల షెడ్డు వేయడం వల్ల వర్షాకాలం, వేసవి కాలంలో విద్యార్థులు ఇబ్బందులు అవకాశం ఉందన్నారు. ఈ పాఠశాలలో చేపట్టిన పనుల వివరాల గురించి ఎమ్మెల్యే అక్కడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆ గ్రామంలోని రోడ్డు మార్జిన్‌లో పూడుకుపోయిన డ్రైనేజీ త్వవకం పనులను ఆయన పరిశీలించారు.టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.



వేములూరు పాఠశాలలో చేపట్టిన పనులపై హెచ్ఎంను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

క్రైస్తవులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల: క్రైస్తవులకు ఎల్లపుడూ అండగా ఉంటానని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హామీ ఇచ్చారు. మండల పాస్టర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం సాయంత్రం అచ్చన్నపాలెంలోని బేతలు ప్రార్థనా మందిరంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవులకు ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మనలను మనమే విమర్శించుకుందాం అనే అంశంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ ఈ అంశంపై సోదాహరణంగా వివరించారు. అనంతరం క్రైస్తవ సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెనుమాక రాజ్‌కుమార్, కోశాధికారి క్లెం రాంబాబు, కార్యదర్శి నిమ్మల సురేష్, ఉపాధ్యక్షుడు డొక్కా శ్యాంబాబు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

- మంత్రి కందుల దుర్గేష్
- రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ నూతన పాలకవర్గం ప్రమాణం

నిడదవోలు: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం రాత్రి పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించారు. సభకు క్లబ్ మాజీ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నిడదవోలు రోటరీ క్లబ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యాక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. భవిష్యత్తులో పేదలకు మరిన్ని సేవలను అందించాలని ఆయన ఆకాంక్షించారు.

క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొర్లెపర వెంకటరత్న కుమార్, కార్యదర్శిగా అనంతపల్లి కృష్ణ చైతన్య, సంయుక్త కార్యదర్శిగా గిద్దా వేణుబాబు, కోశాధికారిగా కోటిపల్లి నాగవెంకట సత్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులతో ఇనస్టలేషన్ అధికారి ఏకేఎస్ భాస్కరరామ్ ప్రమాణం చేయించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేషను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, గ్రంధి బాలాజీ, చిక్కాల రాజా, పొన్నా సుబ్రహ్మణ్యం శర్మ, గమిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

విగ్రహాలను యథాతథంగా కొనసాగించాలి

తాళ్లపూడి: వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీభాయి విగ్రహాలను తొలగించే యత్నాలను మానుకోవాలని ఆ పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, ఆ హైస్కూల్ పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాలలో ఎంఈవో సీహెచ్ బాలామణిని కలసి వినతి పత్రం అందజేశారు. సినీ హాస్య నటుడు లింగాల రామతీర్థ ఆధ్వర్యంలో సర్పంచ్, విద్యాకమిటీ, పూర్వ విద్యార్థుల తోడ్పాటుతో పాఠశాలలో ఈ విగ్రహాలను లోగడ ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాలను తొలగించమని కొందరు రాజకీయ నాయకులు ప్రయత్నం చేస్తున్నారని తమకు తెలిసిందని, ఇది సరైన విధానం కాదని సర్పంచ్, పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా ఉన్న విగ్రహాలను యథాతథంగా ఉంచాలని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు కోరారు. పూర్వ విద్యార్థులు శీర్ల బ్రహ్మానందం, గ్రామస్తులు శూలా పోశియ్య, తైలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఎంఈవోతో మాట్లాడుతున్న సర్పంచ్ తదితరులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల గ్రామంలో సోమవారం రాత్రి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న దూబచర్ల శివారు కొత్తగూడెంకు చెందిన కనికెల్ల విల్సన్ బాబు (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. విల్సన్ బాబు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు సోమవారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళుతూ చీకట్లో కనిపించకపోవడంతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. మృతుడు విల్సన్‌బాబుకు భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సచివాలయ కార్యదర్శి సర్టిఫికెట్ ఉంటేనే ఇసుక

సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: ఇసుక కావాల్సిన వారు విధిగా సచివాలయ కార్యదర్శి సర్టిఫికెట్ తీసుకు రావాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ చెప్పారు. మండలంలోని కుమారదేవం ఇసుక ర్యాంపును సోమవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక నిల్వ కేంద్రం వద్ద చోరీకి అవకాశం లేకుండా భద్రతను మరింత పటిష్టం చేస్తామన్నారు. ఇసుక నిల్వ కేంద్రం (స్టాక్ యార్డు) వద్ద గేట్లు ఏర్పాటు, ట్రెంచ్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. 24 గంటలూ నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. తహసీల్దార్ కె.మస్తాన్, వీఆర్వో సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



స్టాక్ పాయింట్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కాల్దారి రైల్వే అండర్ బ్రిడ్జి 4 రోజులు మూసివేత

ఉండ్రాజవరం: మండలంలోని కాల్దారి– వేలివెన్ను గ్రామాల మధ్య గల రైల్వే అండర్ బ్రిడ్జిని ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు తణుకు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ పీవీఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జి రహదారి మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్టు చెప్పారు. ఈ నాలుగు రోజులూ నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనాలను అనుమతి లేదన్నారు.